**Sakshi**

# 'కొత్త' కొలువులు

## నూతన జిల్లాల్లో అవసరమైన ఉద్యోగ నియామకాలకు సిద్ధం: సీఎం కేసీఆర్

### అర్హత ఉన్నవారందరికీ ప్రమోషన్లు కల్పించేందుకు చర్యలు

- ఎలాంటి పైరవీల్లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలి
- ఉమ్మడి రాష్ట్రంలోని అవలక్షణాలేవీ ఉండొద్దు
- అనుబంధ శాఖలన్నీ ఒకే గొడుగు కిందకు తేవాలి
- శాఖలన్నీ ప్రజలకు అందుబాటులో ఉండాలి
- శాంతి భద్రతలు అత్యంత ముఖ్యం.. పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉండాలి
- సిద్దిపేట జిల్లా ప్రారంభోత్సవంలో పాల్గొంటా
- క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష



శనివారం క్యాంపు ఆఫీసులో కొత్త జిల్లాల ఏర్పాటుపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అవసరమైన మేరకు ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. అర్హత ఉన్న ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇచ్చి వారు పూర్తి నిబద్ధతతో ప్రజలకు సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా సంక్షేమ పథకాల కోసం ప్రజలే నేరుగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమైక్య పాలనలో ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూసేవారని, ఉద్యోగులంటే దొంగల్లా భావించే గత ప్రభుత్వాల ధోరణి తమ ప్రభుత్వంలో

మిగతా 2వ పేజీలో ▶

# 'కొత్త' కొలువులు

▶ మొదటి పేజీ తరువాయి

ఉండదని స్పష్టంచేశారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ శాఖల పునర్ వ్యవస్థీకరణపై సీఎం శనివారం క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్త జిల్లాలకు ఉద్యోగుల సర్దుబాటు, పదోన్నతులు, నియామకాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డీజీపీ అనురాగ్ శర్మ, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్ చంద్, సీఎంవో అధికారులు నర్సింగ్ రావు, స్మితా సభర్వాల్, శాంతాకుమారి, భూపాల్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు, పరిపాలనలో ఉద్యోగులూ భాగస్వాములే అన్న విషయాన్ని మర్చిపోకూడదన్నారు. చిన్నచిన్న అనుబంధ శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. శాంతిభద్రతలు అత్యంత ముఖ్యమని, నేరాల అదుపునకు పటిష్ట పోలీసు వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పడే మండల కేంద్రాల్లో పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు.

### ప్రజలకు చేరువగా..

కొత్తగా ఏర్పడబోయే జిల్లాల్లో ప్రభుత్వ శాఖల పునర్‌వ్యవస్థీకరణ ప్రజలకు మేలు చేసేలా కార్యాచరణ ఉండాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తులో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి లబ్ధిదారుడి వివరాలు కలెక్టర్ల కంప్యూటర్‌లో అందుబాటులో ఉండే విధంగా డిజిటలైజేషన్ చేపట్టాలన్నారు. డిజిటలైజేషన్‌లో అనుభవం, అర్హత ఉన్న ఇంజనీర్లను కలెక్టర్లకు సహాయకంగా నియమించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న అవలక్షణాలేవీ లేకుండా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రభుత్వ శాఖలను పూర్తి స్థాయిలో పునర్ వ్యవస్థీకరించాలని పేర్కొన్నారు. గత పాలకుల పద్ధతులు, సంప్రదాయాలను పక్కనబెట్టి అన్ని ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కొత్త జిల్లాల నమూనా ఉండాలన్నారు.

### సాగు నీటిపారుదలకు ప్రాధాన్యం

వ్యవసాయం, నీటిపారుదల వంటి కీలక రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని సీఎం చెప్పారు. దేశానికే అన్నపూర్ణగా ఉండాల్సిన ప్రాంతం గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కరువుతో తల్లడిల్లే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 58 ఏళ్ల సమైక్య రాష్ట్ర చరిత్రలో ఒకేఒక్కసారి సాగునీటి పారుదలకు రూ.15,500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. సమైక్య రాష్ట్రంలో అవే అత్యధిక కేటాయింపులని వివరించారు. ఇప్పుడు తెలంగాణలో ఏడాదికి రూ.25 వేల కోట్లు కేటాయిస్తున్నామన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 13 మంది ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లు ఉంటే.. నేడు ఒక్క తెలంగాణకే 15 మంది ఉన్నారన్నారు.

### సిద్దిపేట జిల్లా ప్రారంభోత్సవంలో పాల్గొంటా

రాష్ట్ర ప్రజలందరూ సంతోషించేలా కొత్త జిల్లాల ఆవిర్భావం జరగాలని సీఎం ఆకాంక్షించారు. దసరా రోజు కొత్తగా ఏర్పడే సిద్దిపేట జిల్లా ప్రారంభోత్సవంలో తాను పాల్గొంటానని చెప్పారు. మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ వంటి ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇతర జిల్లాల్లో పరిపాలన ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాల పునర్విభజన పురోగతిని చర్చించేందుకు ఈ నెల 6న కలెక్టర్ల సదస్సు నిర్వహించాలన్నారు.